

కథా కౌముది

# తీరం చెరిన అల

అనంత పట్నాయకుని కిశోర్

"నిగాహే బచాకర్ జో చల్తే హై ముఝ్ సే

కభీ ఉన్కో ముఝ్ సే మొహబ్బత్ హుయీథీ

కభీ ఉన్కో ముఝ్ సే మొహబ్బత్ హుయీథీ

జొ మెహబూబ్ సే అజ్ నబీ హోగయేహై

కభీ ఉన్కో ముఝ్ సే మొహబ్బత్ హుయీథీ

కభీ ఉన్కో ముఝ్ సే మొహబ్బత్ హుయీథీ"

ప్రఖ్యాత హిందీ గాయనీగాయకులు జగ్జీత్ సింగ్, అనురాధా పొడ్వాల్ ఓ ప్రైవేటు ఆల్బమ్ కోసం పాడిన పాటను బీచ్ రోడ్డు లో వైయంసీయ్యే ప్రాంగణంలో వేదిక మీద అంత అద్భుతంగానూ ఆలపిస్తున్నారు దిలీప్, లలిత ద్వయం. వారు ధరించిన నల్ల కళ్ళద్దాలు వారి దృష్టి లోపాన్ని సూచిస్తున్నా వారి కంఠాలలోని మాధుర్యం శ్రోతలను కట్టిపడేస్తోంది.

పాటలో సారాంశం చిన్నదే. నవ యవ్వనంలో అప్పుడే ప్రేమలో పడిన ఓ జంట మధ్య జరిగే చిలిపి సన్నివేశాలూ, వాటి పర్యవసానాల నేపథ్యంలో సాగుతుంది గీతం.

ముందు వరుసలో కూర్చుని ఆ గానం లోని సాహిత్యాన్ని ఆస్వాదిస్తున్న డాక్టర్ వివేక్ మెల్లగా కళ్ళు మూసుకున్నాడు. అతని ఆలోచనలు గతం లోనికి వెళ్లాయి.

★★★

తను మెడిసిన్ లో చేరిన మొదట్లో ఓసారి తన మేనమామ పరమేశం గారి ఊరు వెళ్లాడు. అక్కడ చూశాడు పరమేశం గారి పక్కింటి అమ్మాయి సునయనను. పేరుకి తగ్గట్టుగానే అందమైన కళ్ళు!! తనకు నేరుగా ఎదురు పడక పోయినా ఆమె ఉనికి మాత్రం తెలుస్తూనే ఉండేది. తలుపు చాటునుండీ, కిటికీ రెక్కల వెనక నుండీ చాటుగా ఆమెను తాను గమనించడం ఓ హాయి గొలిపే అనుభూతి!! ఆ అనుభూతి కోసమే అవకాశం దొరికిన ప్రతిసారీ తాను మామయ్య గారింటికి వెళ్లడానికి ఉత్సాహం చూపేవాడు. ఆమెను కలవాలని మనసు ఉవ్విళ్లూరుతున్నా ఆమె అంత అవకాశం ఏనాడూ ఇచ్చేది కాదు. కానీ తను మామయ్య గారింట్లో ఉన్నప్పుడు కిటికీ వెనుక నుండి ఆమె శ్రావ్యమైన కంఠం నుండి లతా మంగేష్కర్ పాటలు వినిపించేవి.

ఒకసారి, తను ప్రేమగా భావించే ఆరాధనను ఆమెకు ఎలాగైనా తెలియపరచాలని తన మనసులోని మాటను ఓ కాగితం మీద పెట్టాడు.

"సునయనా! నీ రూపం, నీ నవ్వు, నీ పాట, నన్ను నీ అభిమానిని చేసేశాయి. రోజంతా నీ ఆలోచనలే నన్ను అలముకుంటున్నాయి. ముందు జీవితం నీ సాంగత్యంలో సాగాలని నా మనసు గాఢంగా కోరుకుంటోంది. విశాలమైన నీ నేత్రాలు శాశ్వతంగా నావి కావాలని ఆశిస్తున్నాను. కాదనవని భావిస్తాను. నా అడ్రస్ ఈ క్రింద ఇస్తున్నాను. నీ జవాబు కోసం ఎదురు చూస్తుంటాను."

ఆ లేఖ ఆమెకు అందించాలని ప్రయత్నం మొదలు పెట్టాడు. ఏదో పనిమీద అత్తయ్యని కలవడానికి ఆమె వచ్చినప్పుడు తను రాసుకున్న లేఖను అక్కడే టేబుల్ మీదున్న ఓ పుస్తకంలో పెట్టి ఆమెకు అందించాడు. ఆమె ఒక్క క్షణం తడబడ్డా, ఆ పుస్తకం అందుకుని కిలకిలా నవ్వుతూ తన విశాల నేత్రాలను తుమ్మెదరెక్కల్లా ఆడించి అక్కడి నుండి పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయింది. మధ్యాహ్నానికి వివేక్ తమ ఊరికి వెళ్లాల్సి వచ్చింది.

ఎంతకాలమైనా ఆమె నుండి జవాబు రాకపోవడంతో నిరాశ చెందాడు. అప్పుడు కలిగిన జంకుతో మళ్లీ మామయ్య గారింటికి వెళ్లే ప్రయత్నం చేయలేదు.

తన చదువు పూర్తయ్యాక కొంతకాలానికి అంధురాలైన లలితను ఆదర్శ వివాహం చేసుకున్నాడు. ఆమెలో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి ఆమె చేత ఈ ఆర్కెస్ట్రా నడిపిస్తున్నాడు.

★★★

గానసభ ముగియగానే లలిత సేవకురాలి సహాయంతో తన భర్త డాక్టర్ వివేక్ ను చేరుకుంది. ఆమెను ఓ పక్కగా కూర్చోబెట్టి దగ్గరలోని టేబుల్ వద్దకు వెళ్లాడు డాక్టర్ వివేక్. ప్రతి నెలా మూడో ఆదివారం ఆ వేదిక మీద లలిత నిర్వహించే అంధుల ఆర్కెస్ట్రా కార్యక్రమం జరుగుతుంది. ఆ కార్యక్రమం పూర్తయిన తరువాత డాక్టర్ వివేక్ ఉచిత వైద్య సేవ ఉంటుంది.

పెద్దగా జనం లేకపోయినా డాక్టర్ వివేక్ ని కలవడానికి వచ్చే రోగులు, వారి బంధువులు ఆర్కెస్ట్రా కార్యక్రమం చూడడం వలన నిర్వహకులకు కూడా కొంత ప్రోత్సాహకరంగా ఉంటుంది.

ఉచిత వైద్య సేవకోసం వచ్చిన వారు ఒక్కొక్కరూ వివేక్ సలహాలు తీసుకుని వెళ్లిపోతున్నారు. కొద్దిగా చీకటి పడుతుండగా ఆఖరి వ్యక్తి వచ్చి నమస్కారం చేసి తన చేతిలోని రిపోర్టులు వివేక్ ముందుంచి చెప్తున్నాడు. దాదాపు యాభై ఏళ్లుంటాయతనికి. “నమస్కారం సార్. మాది ఒరిస్సాలోని రాయగడ సార్. మా అక్కకు ఆరోగ్యం బాగాలేదు. గత నాలుగేళ్లుగా ఎందరో డాక్టర్లకు చూపించాం కానీ ప్రయోజనం లేదు. ఆపరేషన్ చేసినా పెద్దగా ప్రయోజనం ఉండదంటున్నారు. మాది మధ్యతరగతి కుటుంబం. వైద్యం చేయించడానికి డబ్బులు సరిపోవడం లేదు. అలా అని చూస్తూ వదిలేయలేకపోతున్నాం. మీ సలహా కోసం వచ్చాను.”

రిపోర్టులన్నీ పరిశీలించాడు వివేక్. టెర్మినల్ ఇల్ నెస్. ఇంచుమించు చివరి దశ. ఇంకా ఏంచేసీ ప్రయోజనం ఉండదు. అయినప్పటికీ ఓసారి పేషెంటుని ప్రత్యక్షంగా చూస్తే మంచిదనిపించి “రేపు పేషెంటుని హాస్పిటల్ కి తీసుకు రండి. పరీక్షలు చేసి చూద్దాం. ఖర్చుల గురించి భయపడకండి. ఏదో ఒకటి చేద్దాం.” భరోసా కల్పించాడు.

“డాక్టరు గారూ. మరోమాట అడగవచ్చా?“ సందేహిస్తూ అడిగాడతను.

“ఏమిటది?”

“మీరు మా పరమేశం అంకుల్ గారి బంధువులబ్బాయేనా?”

“ఔనండీ. మీకెలా తెలుసు?”

“వాళ్ల పక్కింట్లో ఉండేవాళ్లం సార్. సునయన మా అక్క. ఆమెవే ఈ రిపోర్టులు”

కేసు పరిశీలించే పనిలో తాను రిపోర్టులో పేషెంటు పేరు గమనించలేదు.

“అలాగా?” అన్నాడు బాధగా. “ఆమె ఎక్కడుంది ఇప్పుడు?”

“మా ఊళ్లోనే ఉంది సార్. నేను రిపోర్టులు మీకు చూపిద్దామని వచ్చాను. ఇక్కడ మిమ్మల్ని చూసి గుర్తు పట్టాను. నన్ను గుర్తు పట్టారా సార్? ధనంజయ సాహూ సార్” ఉత్సాహం, ఉద్వేగం, ఆశ, నిరాశ --- అన్నీ ఒక్కసారే ధ్వనించాయి అతని కంఠంలో.

మరచిపోయిన విషయం బాధాకరంగా ఇలా ఎదురవ్వడంతో వివేక్ మనసు పరిపరి విధాలుగా పోయింది. ఎందుకిలా జరిగింది?? ప్చ్! సునయన!! సుందరస్వప్నం కరిగిపోతోంది!! తానేమైనా చేయగలడా? ఆశ లేదు.

“ఆమె ఏంచేస్తోంది? ఉద్యోగం ఏమైనా చేస్తుందా? ఆమె భర్త, పిల్లలు, ఇతర వివరాలేంటి?” కుతూహలంగా అడిగాడు వివేక్.

“టీచర్ గా చేసేది సార్. మూడేళ్లుగా అనారోగ్యంతో మానేసింది. పెళ్లి చేసుకోలేదు సార్.”

“అయ్యో అలాగా?” అన్నాడు నిస్పృహగా. అపరాధ భావం క్రమంగా ఆవహిస్తోందతడిని.

తగ్గు స్వరంలో ధనంజయ అన్నాడు “నేనే కారణం సార్. అక్కకి తెలుగు రాయడం చదవడం రాదు. ఒరియాలో చదువుకుంది. మీరిచ్చిన ఉత్తరం రహస్యంగా చదివి చెప్పమని నాకిచ్చింది. నేనది చదివి భయపడిపోయి మా అమ్మకి చెప్పాను. అదివిని అమ్మానాన్నా అక్కని దండించారు. ఇంటి గడప దాటడానికి వీల్లేదన్నారు. కాలేజీ మాన్పించేశారు. తరువాత తను ప్రైవేటుగా చదువుకుని ప్రైమరీ స్కూల్లో టీచర్ గా చేరింది. బాగా డీలా పడిపోయింది సార్. మీరు కూడా ఆ తరువాత మళ్లీ రాలేదు. అమ్మానాన్నా పెళ్లి ప్రయత్నాలు చేస్తే తను మొండిగా నిరాకరించింది. ఒంటరిగా ఉండిపోయింది. ఎప్పటికైనా మీరు కలుస్తారని మీతో మాట్లాడడానికి పట్టుదలగా తెలుగు నేర్చుకుంది. కానీ ఏం ప్రయోజనం!”

వింటున్నంతసేపూ వివేక్ మౌనంగా ఉండిపోయాడు. తెలిసీ తెలియనితనంతో తను రాసిన ఆ ఉత్తరం ఆమె జీవితంతో ఆడుకుంది. తను దోషి!! ఆకాశం విరిగి పడుతున్నట్టూ, భూమి బద్దలౌతున్నట్టూ, సముద్రంలోని అలలన్నీ ఒక్కసారిగా తీరం దాటి తనపై దాడి చేస్తున్నట్టూ అనిపించసాగింది. రాత్రి ఎనిమిది గంటలు దాటుతుండడంతో నిర్లిప్తంగా “తీసుకురండి. చూద్దాం“ అంటూ లేచాడు.

★★★

ఓ వారం తర్వాత సునయనను హాస్పిటల్ లో చేర్చాడు ధనంజయ. డాక్టర్ వివేక్ రౌండ్స్ చేస్తూ ఆమెను సమీపించాడు. నమస్కారం చేస్తూ చిన్నగా నవ్విందామె. బాగా శుష్కించిపోయింది. రక్తహీనత వల్ల శరీరమంతా తెల్లగా పాలిపోయి ఉంది. కళ్లలో మాత్రం ఆ మెరుపు అలాగే ఉంది. ఆమెను సూటిగా కళ్లలోకి చూడలేకపోయాడతను. పక్కచూపులు చూస్తూ నాడి పరిశీలించాడు. కళ్ల క్రింది రెప్పలు కాస్త కిందకు లాగి చూశాడు. నాలుక చూపించమన్నాడు. ఆ ప్రాథమిక పరీక్షలతో ఆమె ప్రస్తుత పరిస్థితిని బేరీజు వేసుకుంటూ ధనంజయతో అన్నాడు “ఎంఆర్ఐ తీయిద్దాం. ఏం చేయాలో అప్పుడే ఆలోచిద్దాం.”

మాట మారుస్తూ సునయన అంది “బాగున్నారా? మమ్మల్ని మర్చిపోయారు.”

“మర్చిపోలేదండీ. మీరెక్కడున్నారో తెలియలేదు. చిన్నతనంలో ఏవో చేస్తుంటాం. ఒక్కోసారి అనుభవం లేకపోవడం వలన అవి ఎదురు తిరుగుతాయి. అంతే!” తప్పించుకునే ప్రయత్నం చేశాడు.

“మిమ్మల్ని మళ్లీ కలుస్తాననుకోలేదు. మొన్న మా తమ్ముడు మిమ్మల్ని కలిశానని చెప్పాడు. మీ శ్రీమతి గారు చాలా బాగా పాడతారట కదా. చాలా సంతోషం కలిగింది.” కళ్ళల్లో చిన్నప్పటి అదే చలాకీతనంతో చెప్పిందామె.

ఔనన్నట్టుగా మౌనంగా తలూపి ముందుకు కదిలాడు వివేక్.

పరీక్షలన్నీ అయ్యాక రిపోర్టులన్నీ శ్రద్ధగా పరిశీలించాడు వివేక్. సమస్య ఆమె ఊపిరితిత్తులలో. చాలా అరుదుగా సంభవించే ఐపీయఫ్ అనబడే వ్యాధి అది. ఊపిరితిత్తులు తమ సహజమైన సంకోచ వ్యాకోచ గుణాన్ని కోల్పోయాయి. ప్రస్తుతానికి వైద్యశాస్త్రంలో నివారణ కానీ ఉపశమనం కానీ లేని వ్యాధి అది. ఉన్న ఒకేఒక్క ప్రత్యామ్నాయం ఊపిరితిత్తుల మార్పిడి! అది చాలా ఖర్చుతోనూ రిస్క్ తోనూ కూడుకున్న ప్రక్రియ! ధనంజయని పిలిపించి వివరించాడు. “ఖర్చులకోసం సంశయించవద్దు. హాస్పిటల్ ద్వారా వీలైనంత తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తాం. కానీ రిస్కుకు మీరు సిద్ధపడాలి.”

“ఒకసారి మావాళ్లతో సంప్రదించి చెప్తాను సార్” అని వెనుదిరిగాడు ధనంజయ.

మరో రెండు రోజుల తరువాత ధనంజయ వచ్చి ఆపరేషన్ తమకు ఆమోదమేనని చెప్పాడు. తరువాతి ఏర్పాట్లన్నీ చకచకా జరిగిపోయాయి. ఆపరేషన్ కు ముందు రోజు డాక్టర్ రౌండ్స్ లో వివేక్ వచ్చినప్పుడు సునయన అతనికి ఓ పుస్తకం అందిస్తూ “ఆపరేషన్ తరువాత నేను మళ్లీ మిమ్మల్ని చూస్తానో లేదో తెలియదు. అందుకే ముందుగానే మీకిది అందిస్తున్నాను. ఆపరేషన్ కి ముందే మీరు ఇది చూడాలని నా కోరిక” అంది.

వివేక్ కాస్త ఇబ్బందిగా ఆ పుస్తకం అందుకుంటూ దాని మధ్యలో మడిచిన కాగితం ఉండడం గమనించాడు. దాన్ని తీసుకుని తన కన్సల్టేషన్ రూమ్ కి వెళ్లిపోయాడు.

ఓపీ పూర్తయ్యాక ఆ పుస్తకాన్ని చేతిలోకి తీసుకొని పరికించి చూశాడు. రబీంద్రనాథ్ టాగూర్ వ్రాసిన ‘ఫేర్ వెల్ మై ఫ్రెండ్’ పుస్తకం అది. తనింతకు ముందు ఆ పుస్తకం గురించి విన్నాడు కానీ ఎప్పుడూ చదవలేదు. పుస్తకం అట్ట బాగా నలిగిపోయి ఏదో చాలా పాత పుస్తకం అని తెలుస్తోంది. పేజీలు తెరిచి మధ్యలో ఉన్న మడిచిన కాగితం తీశాడు. ఆమె ఏం వ్రాసి ఉంటుందా అని ఆలోచిస్తూ చదవడానికి సమాయత్తమయ్యాడు.

“డాక్టర్ వివేక్ గారికి ------ ఇంతకంటే దగ్గరగా సంబోధించే చనవుకు నేను నోచుకోలేదు. మిమ్మల్ని కలవడానికి, మీరెక్కడ ఉన్నదీ తెలుసుకోవడానికి నాకు అవకాశం లేకపోయింది. ఏనాటికైనా మీరే నన్ను వెతుక్కుంటూ వస్తారని ఆశగా ఉండేది. కాలం గడిచేకొద్దీ నా ఆశ అడియాస అనిపించేది. ఓ తీరం చేరని అలగా మిగిలిపోయింది నా జీవితం.

మిమ్మల్ని ఈ జన్మలో మళ్లీ కలవగలనని అనుకోలేదు. కానీ మీకు ఓ విషయంలో బాకీ పడి ఉన్నాను. బహుశా ఆ బాకీ తీర్చుకోవడానికే ఆ జగన్నాథుడు నన్ను మళ్లీ ఈ రకంగా మీ దగ్గరికి చేర్చాడు. మీ గురించి తమ్ముడు చెప్పగానే చాలా సంతోషం కలిగింది. నా వ్యాధి తగ్గేది కాదని నాకు తెలుసు. మామూలుగా అయితే నేను ట్రీట్మెంట్ కు ఇష్టపడేదాన్ని కాదు. కానీ ట్రీట్మెంట్ నెపంతో మిమ్మల్ని కలవవచ్చన్న ఆశతో సరేనన్నాను.

ఈ పుస్తకం గుర్తుందా? మీరు నాకు ఆ ఉత్తరం అందించింది ఈ పుస్తకం లోనే. మీ ఉత్తరం పర్యవసానం ఏం జరిగిందో ధనంజయ మీకు ఇదివరకే చెప్పాడు కదా! అలా జరిగి, ఆ తరువాత మీరు తిరిగి రాకపోయే సరికి మీరు నాకు ఈ పుస్తకం ద్వారా అన్యాపదేశంగా వీడ్కోలు పలికారని అనిపించేది. ఈ పుస్తకం నా జీవితంలో ఓ భాగమైపోయి అనునిత్యం మీరు నాతోనే ఉన్నట్టు తోచేది. ఫేర్వెల్ అంటూనే నాతో ఉన్న భావన --- చిత్రంగా ఉంది కదూ!

నా జీవిత ప్రయాణం చివరి దశకు చేరుకుంది. నాకంటూ ఓ కుటుంబం లేదు. మీ గుర్తుగా నా జీవితంలో ఓ భాగమైపోయిన ఈ పుస్తకం నా తరువాత దురుపయోగం కాకూడదని చాలా బలంగా కోరుకునేదాన్ని. ఈ రోజు దీన్ని మీకు తిరిగి అందజేస్తున్నాను. అనాలోచితంగా ఒకనాడు మీరు నాకిచ్చిన వీడ్కోలును మనసారా ఈరోజు మీకు తిరిగి ఇస్తున్నాను.

ఇకపోతే, నేను మీకు పడిన బాకీ ఏమిటో చెప్పలేదు కదూ!! మీకు గుర్తుందా? 'విశాలమైన నీ నేత్రాలు శాశ్వతంగా నావి కావాలని ఆశిస్తున్నాను' అని వ్రాశారు. అవి మీకందించడానికే కాబోలు ఆ భగవంతుడు నన్ను ఇన్నాళ్లూ ఇలా బ్రతికించాడు. ఈ నేత్రాలను మీ శ్రీమతి గారికి అమర్చి శాశ్వతంగా అవి మీ స్వంతమయ్యే వరాన్నీ, తద్వారా శాశ్వతంగా మిమ్మల్ని చూస్తూ ఉండే భాగ్యాన్నీ ప్రసాదించమని వేడుకుంటున్నాను. ఆపరేషన్ ముందైనా తరువాతైనా సరే మీ ఇష్టం!! నిరాశ పరచరని నమ్ముతున్నాను."

వివేక్ కళ్లు చెమ్మగిల్లాయి. ఈ రకంగా అంధురాలైన తన భార్యకు శాశ్వతంగా దృష్టి కలగడం, అదీ తనకు అత్యంత ప్రియమైన సునయన వర ప్రసాదంగా లభించడం ... ... అతడి మనసంతా ఓ అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది!!

ఏదేమైనా తన శక్తినంతా ఒడ్డి సునయనను బ్రతికించుకోవాలన్న కృత నిశ్చయంతో ముందుకు కదిలాడు.

★★★

సునయనకు అతి క్లిష్టమైన ఆపరేషన్ జరిగింది. అదృష్టవశాత్తు అది సంపూర్ణంగా విజయవంతమైంది. సునయన మెల్లగా కోలుకుంది. ఆ దరిమిలా ఆమె కోరిక మేరకు ఆమె నుండి ఒక నేత్రాన్ని లలితకు అమర్చడం జరిగింది.

COMMENTS